# కంచికి చేరిన కథ

నాగన్న బేల్దారీ మేస్త్రీ.

అతన్ని తెలియనివాళ్ళు వూళ్ళో ఎవరూ లేరు. ఇరుగు పొరుగు వూళ్ళల్లో కూడా అతనికి పేరుంది.

రోజు కూలీకి పోతాడు నాగన్న.

నలుగురు పిల్లలూ, లచ్చి అతని సంసారం.

లచ్చి కూడ పెద్దరెడ్డి ఇంట్లో పనికిపోతుంది. అయన మంచి మోతుబరి రైతు. చీకట్లో ఆయనింటికిపోతే, మళ్ళీ చీకటిపడేవరకూ ఆమెకు అక్కడిపనే సరిపోతుంది. ఏదో వొకటి పురమాయిస్తూనే వుంటారు; ఆ యింట్లోవాళ్ళు. ఈమధ్యన ఆ పని మానేసింది. కూలి పనులూ, నాలి పనులూ చేయడం మొదలెట్టింది. ఆమని కాలంలో ఏ కళ్ళంలో చూసినా ఆమే. కొన్ను లేనప్పుడు మొగ కూలీలతోపాటు పందెంవేసుకుని పనిచేస్తుంది. పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టాలనే ఆమె ధ్యాస. ఎంత

పనిచేసినా, ఇద్దరూ సంపాదించినా ఇల్లు గడవడం అంతంత మాత్రంగానే వుంది.

"నెలకింత వస్తే బాగుణ్ణు" అనుకుంటూ వుంటాడు నాగన్న. ఈ ఆలోచనంతా అతనికి పనిలేని రోజుల్లో లచ్చితో చేసే సంభాషణే.

పనివున్నరోజున అతని దినచర్యే వేరు. పగలంతా కష్టపడి కనిచీకటి పడినాక అతని కాళ్ళు ఆర్టీసీ బస్టాండు వెనకాల గుడిసెకే దారితీస్తవి.

అర్థరాత్రీ, అపరాత్రీ వచ్చి—పులినొప్పులతో పొర్లుతూ పొర్లుతూ నిద్ర పట్టించుకోబోయే లచ్చిమీద పడ్తాడు. ఆమెకు హాయిగా కన్నంటేది కరువయ్యింది.

లచ్చి సంసారం గురించి రాజమ్మకు యిట్టే తెలిసిపోయింది.

లచ్చి గుడిసె ప్రక్కనే రాజమ్మ యిల్లు. రాముల్ని కట్టుకుని ఈ వూరొచ్చింది రాజమ్మ.

రాజమ్మ మంచిపిల్ల. నల్లగా వున్నా కనుముక్కు తీరు బాగుంటుంది. వాళ్ళ వూర్లో ఎనిమిదో తరగతి చదివింది. లచ్చికి చదువురాదు. "తెలివిగల పిల్ల" అని రాజమ్మను చూసి, చాలాసార్లు అనుకుంది లచ్చి.

వాళ్ళిద్దరి పరిచయమూ నెలరోజులదే అయినా, అక్కాచెల్లెల్లా కలిసిపోయారు.

రాములుకి చిన్న దుకాణం వున్నది. అతనికి వొక ముసలి అవ్వ తప్ప ఎవ్వరూ లేరు. సంపాదన మూడు పొట్టలకు హాయిగా సరిపోతుంది.

రాములుకి చదువు లేకపోయినా, తలకుమించిన ఆలోచనలు ; తాహత్తుకు మించిన ఊహలు. మనిషి బాగా ఎత్తరి. బలవంతుడు. వడదిరిగిన కండలు—అందగాన్నని గర్వం. ఉన్న వూర్లో బతికి సంపాదించేదేం లేదనీ, సినిమాల్లో వేషాలెయ్యాలనీ రాములు కోరిక. ఈ ఊహలకు తోడు—ఉత్సాహం కూడా దండిగా వుంది. కోడిపందేలు, కొబ్బెర పందేలంటే పడిచస్తాడు. చేత మిగిలే లెక్కని ఎక్కడో జారవిడవడం అలవాటయింది.

మొగుడు మిడిమేలంగా పోతున్నట్టు నెలరోజుల్లోనే ఆకళింపయింది రాజమ్మకు. వో రోజు లచ్చి తన కష్టాలు కలబోసుకుంటుంటే, ఈ ప్రస్తావన తెచ్చింది రాజమ్మ. లచ్చి నవ్వేసింది. "వయసులే పిల్లా. నాలుగునాళ్ళుపోతే అయ్యన్నీ పోతై. నీ కొంగట్టుకు తిరుగుతాడ్లే" అంటూ ముసిముసి నగుతో నేదరపిల్లోన్ని వొళ్ళోకి తీసుకుంది.

నాళ్ళు గడిచినై.

ఆరోజు—

చీకటి పడింది.

ఇంట్లో కుములుకుని ఏడ్చి—వీధినబడింది లచ్చి.

పిల్లోల్లంతా బిక్కుబిక్కున చూస్తూ రావిచెట్టుకింద కెల్లారు.

నాగన్న యవారం ఏం బాగోలేదని అర్థమైంది.

నలుగురూ చేరేరు. లచ్చికి ఏమి చెప్పాలో, ఎట్లా చెప్పాలో అర్థంకాలేదు. నాగన్న తూలుతూ వూగుతూ పక్కగా రాతిమీద కూర్చున్నాడు.

"బువ్వకులేక చస్తావుంటే ఈయన తాగేదానికి అంతు లేకుండా వుంది. దినాం తాగేదానికి మాలాటోల్ల కవుతుందా సెప్పండి. సిన్నా, సితుకూ—ఈ సంసారంవేం గావాల ?" చివరికి విషయం బయటపెట్టింది లచ్చి. "ఎంత సెప్పినా యినకుండా—పూనకం వొచ్చినట్టు నా వొళ్ళు కుళ్ళబొడుస్తా వుండాడు."

ఊరి పెద్దల్లో వొక పెద్దాయన బుద్ధి చెప్పేడు.

అర్థగంట తర్వాత—నిమ్మళంగా ఎక్కడివాళ్ళక్కడ జారుకున్నారు.

ఆరాత్రికి—రావిచెట్టుకిందే తెల్లారింది లచ్చికీ, పిల్లలకీ.

రాజమ్మకి గుండెల్లో గుబులయ్యింది.

రాములు గుర్రుపెట్టి నిద్దరపోతావుంటే, ఆలోచనల్లో అలిసిపోయింది రాజమ్మ.

నాగన్న తాగుడుతో లచ్చి సంసారం ఎక్కిరాదన్నట్టనిపించిందామెకు. లచ్చిమీద జాలితో కునుకు పట్టలేదు రాజమ్మకు.

వారంరోజుల తర్వాత—

కొట్టు కట్టేసి బాగా పొద్దుపోయినాక ఇంటికొచ్చాడు-రాములు.

తలుపు తియ్యంగానే, మొగుడి వాలకం తెలిసిపోయింది రాజమ్మకు.

రాములు సారాయి మరిగినాడు.

గుండె పగిలిపోయిందామెను. తాను భయపడినంతా అయ్యింది.

మాటా పలుకూ లేకుండా మంచమెక్కింది రాజమ్మ. మజ్జిగన్నం పిసుక్కుని తాగేసి ఇవతలి కొచ్చాడు రాములు.

మంచంకాడి కొచ్చిన మొగుణ్ణి సీత్కారం చేసింది రాజమ్మ. బుంగమూతితో మంచంకోడుకు తల ఆనించి కూర్చున్నాడు రాములు.

ఇచ్చకాలు మొదలెట్టాడు. పరాచికాలతో మురిపెంపు మాటల్తో బతిమాలుకుంటూ రాజమ్మ మొగాన్ని తనవేపు తిప్పుకున్నాడు రాములు.

" చేసేదిలేక వూరుకోవడం కాదు. మొదటి తప్పు కదా అని నీ మొగం సూత్తన్నా" అనింది రాజమ్మ. ఆమె కళ్ళల్లో నీళ్ళు మొలిచాయి.

సగం రేతిరిదాకా మొగునికి బుద్ధులు చెప్తానే వుండింది రాజమ్మ. "సువ్ చెడ్డ అనిపించుకుంటే—నాకు మనసుకి కట్టమౌతుంది. అదీగాక, ఇయ్యాల మనిద్దరంవే. రేపో కాయ గాస్తే, బువ్వపెట్టాల. పెద్దోన్ని చెయ్యాల. ఒప్పుకుంటావా " అని గోముపోయింది.

ఆ తర్వాత, అసలు విషయమూ చెప్పింది— అప్పుడు తాను వట్టి మనిషి కాదు !

రాజమ్మ కాన్పుకు పుట్టింటికిపోయి బిడ్డడ్ని ఎత్తుకుని తిరిగి వచ్చేసరికి-రాములు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సినిమాల్లో చేరాలనే కోరికతో చెన్నపట్నం పోయిరావడం, జూదాలూ—పందేలూ అలవాటు గావడం జరిగేయి.

తన సంసారం గురించి చెప్పుకుంటూ, రాములు నిర్వాకం గురించీ వివరంగానే చెప్పింది లచ్చి. ఇక లాభం లేదనుకుంది రాజమ్మ.

ఆరాత్రి గట్టిగానే చెప్పింది రాములికి.

"నీ మొహం లేవే. ఎర్రి ఆలోచన్లు పెట్టుకోమాక" అంటూ పెళ్ళాన్ని మురిపించాడు రాములు. ఈ పొర పొచ్చాలతో ఆ రాత్రిని వృధా కానివ్వకుండా తన ఇచ్చకాలతో రాజమ్మని మచ్చిక చేసుకోగలిగేడు, రాములు.

మొగుణ్ణిచూసి ఏడ్చుకొంటూ వుండే లచ్చిని చూస్తుంటే, గుండె చెరువై పోతావుంది రాజమ్మకు. తిండికి కరువై కుములుకుని అనారోగ్యంపాలై పోతా వున్నారు చిన్నపిల్లలు. అర్థంగాని బతుకును చేసి తాను సారాయి మస్తుగా మరిగినాడు నాగన్న.

"వాణ్ణేంచేసినా మారడే లచ్చి...." అని వదిలేశా రంట పెద్దరెడ్డి కూడా. రోజూ చచ్చేవాడికోసం ఎవరేడుస్తారు, అందుకే ఆమె కష్టాల పరంపర ఊరికి కాబట్టలేదు.

రాజమ్మకు ఎప్పుడూ ఆలోచనలే. ఆ ఆలోచనల్లో ఎప్పుడూ కొడి దొరకదు. తానుగా లచ్చికి ఏ సాయం చెయ్యగలదు? చంటోళ్ళకి పస్తులున్నపూట రెండు కరుళ్ళ అన్నం పెడ్తుంది. లచ్చికి అడపా దడపా వో పాతచీరె ఇస్తుంది.

పేడ గంపెత్తుకుని ఎదురింటి వాముదొడ్డి కాడకి వెళ్తోంది లచ్చి. ఆమె అక్కడ పిడకలుచేసి గోడకు కొట్టి ఎండబెడ్తుంది. రాజమ్మ లచ్చిని పిలిచింది. లచ్చి వచ్చింది.

చేటలో పేలాల్ని వో బుక్కెడుతీసి లచ్చి కొంగున కట్టింది.

"ముసురుకున్న మబ్బుల్లా ఈ కష్టాల్లో మగ్గిపోయే బదులు, టౌనుకన్నా పోకూడదూ ?" అని సలహా యిచ్చింది. పేలవంగా నవ్వింది లచ్చి.

"ఉన్న ఊర్లో బతకలేక, ఊర్లు పట్టుకపోతే బతగ్గలమా—నీ పిచ్చిగానీ రాజమ్మా, అయినా మీ బావ నా మాటినుకునే రోజులా ఇవి" అంటూ అక్కణ్ణుంచీ కదిలింది లచ్చి.

మరోమాట మాట్లాడలేకపోయింది రాజమ్మ. ఆమెకు దిగులెక్కువైంది.

సంక్రాంతి వచ్చింది, వెళ్ళిపోయింది.

కనుమ పండుగ రాత్రి—మళ్ళీ సారాయి తాగి ఇంటికొచ్చేడు, రాములు.

రాజమ్మ మండిపడింది. మొగుణ్ణి నిలవేసింది. "ఇదేం బాగాలేదు. నేను ఆనాడే చెప్పాను. మొదటిసారి అని నీ మొగం చూశాను. మళ్ళీ కత మొదలెట్టావ్, నీ కిదేం పొయ్యేకాలం ?"

"ఇయ్యాల కనుం పండుగ. కోడిపందేల వుషారులో తాగేను. ఇగమీదట సారాయి క్కొట్టుకేసి చూడను. నమ్ము" అన్నాడు రాములు.

రాత్రంతా ఆలోచనల్లోనే గడిచిపోయింది, రాజమ్మకు.

మళ్ళీ పదిరోజుల్లో రెండుసార్లు మొగుణ్ణి నిలవెయ్యాల్సొచ్చింది రాజమ్మకు. అతని మాటల్ని ఇక నమ్మదల్చుకోలేదామె.

ఏమీ చేయలేని స్థితిలోకి దిగబడితే, ఇంక అపైన అథోగతే — అని నిర్ధారించుకుంది. మొగుడి ఆదాయమేంవీ దర్జాగా బతికేదానికి సరిపడేది కాదు. అంగడిమీది రాబడి సంగడికే చాలదు నాలుగు పొట్టలకి. ఈయన ఈ అలవాటుకి బానిసైతే, ఎట్టబ్బా బతికేది అని ఆనోదు లేకుండా ఆలోచించింది రాజమ్మ. చివరికి ఆ ఆలోచన తెగింది.

మర్నాడు — తెల్లారేతలికే పిల్లవాణ్ణి చంకనేసుకుని పుట్టింటికి ప్రయాణం కట్టింది. రాములూ, అతని అవ్వా ముక్కున వేలేసుకున్నారు. సంసారాన్ని కూలదోసుకుని ఇట్టా పోవడం బాగులేదన్నారు. ఇరుగింటి పొరుగింటోళ్ళూ అదే మాటన్నారు.

రాములు "నేనింక నువ్ సెప్పినట్టినుకుంటానే" అన్నాడు, బతిమాలుకునే ధోరణిలో. అతని అవ్వా అతనికి వంతపాడింది.

ఊరి పెద్దలూ కలుగజేసుకున్నారు. పెద్ద విచారణే జరిగింది.

పెద్దిరెడ్డి అన్నాడు, "ఆడపిల్లకి ఇంత తెంపరితనం పనికిరాదు. మేంవంతా లేమా. మేం చూస్తాం గదా. మా మాటినుకో."

రాజమ్మ మాటలేదు, పలుకు లేదు. తాను తెలివి తక్కువ పని చేయడంలేదనే నమ్మకం ఆమెకుంది. అందుకే ధైర్యంగా ముందుకు కదులుతూ, "పక్కనున్న లచ్చి బతుకు చూస్తానే వున్నా, మీరంతా ఏంచేస్తావున్నారో కూడా నా రాకళింపయింది. రేపు ఈయన సారాయి మరిగి నాగన్నగా మారిపోతే మీరంతా నాకాడకొచ్చి నన్నుద్ధరిస్తారని నమ్మే తెలివి నాకు లేదు. ఆయన నేనే కావాలనుకుంటే, ఆ సారాయి మానేసి నా కాడకి రమ్మనండి. చెయ్యిలో చెయ్యేసి తిరిగొస్తా...." అని తెగేసి చెప్పింది.

ఇవన్నీ చూస్తున్న లచ్చి రాజమ్మ వేపు చితుకు చితుగ్గా చూసింది.

రాజమ్మ అడుగు ముందుకే వేసింది. ఊరు మీదుగా నడిచిపోయింది.

ఆశ్చర్యంతో ఆమె వేపు చూస్తూ వుండి పోయింది లచ్చి.

ఆ దినమంతా ఊరంతా అబగుబులుగానే వుండింది. ఎక్కడ విన్నా ఈ వింతే.

రాములు పని కష్టంగా వుంది. అంగట్లో కూర్చుంటే, వచ్చేపోయే వాళ్ళంతా తన వేపే చూసి, "ఏరా రాములూ, నీ పెళ్ళాం నిన్నొదిలేసి పోయిందంటగా" అని అడుగుతున్నట్టే అనిపిస్తోంది. మంచీ చెడ్డా లేకుండా ప్రతివాడూ తన మీదే నేరం మోపుతూ చూస్తున్నట్టుగా వుంది.

ఇంటికి పోతే ముసల్ది వొకటే నస. ఆమెకు కొంతకు కొంతకూడా తెలీదు. చెపితే అర్థం కాదు, "నట్టింటో బుల్లోన్ని ఎల్లగొట్టినావ్" అని వొకటే రొద.

"అంతా కలిసి నన్నే ఆడిపోసుకుంటునట్టున్నారు" అనుకున్నాడు రాములు. అంగట్లో కూచోలేకపోతున్నాడు. ఇంట్లోనూ వుండలేకపోతున్నాడు.

నాగన్న అంగడి కాడి కొచ్చాడు. మాట కలిపేడు.

"నీకేం బయ్యం లేదు. నువ్వట్టా నిలబడు. నెల తిరిగే సరికి మొగుణ్ణి ఎతుక్కుంటూ వస్తార్రా ఈ ఆడోల్లు. దిగులు పెట్టుకోమాక," అంటూ ఆర్టీసీ బస్టాండు వెనకాతల గుడిసెకు తీసకెళ్ళాడు.

రాములుకి మనస్కరించ లేదు. రాజమ్మ గుర్తొచ్చింది. బుడ్డోడు గుర్తుకొచ్చాడు. గొంతు బిగుసుకపోయింది. గుటక పడలేదు. హాలమారింది.

కత్తులు నూరుతూనే గడిచిపోతోంది, కాలం.

నాలుగు నెలలు గడిచినై.

చిల్లర పనులు కూడా చెయ్యబుద్ధి కావడంలేదు రాములుకి. రాములు తనకి పనికిరాడని తెలిసిపోయింది. అతన్ని వదిలేశాడు నాగన్న.

లచ్చికి రాజమ్మ గుబులెక్కువైనాది. ఇబ్బందుల్లో ఆదుకునేది. సిన్నపిల్లోళ్ళకి ఇన్ని గంజినీళ్ళు పోసేది. అరాకొరాజీళ్ళు పెట్టేది. ఆమెకు అవే గుర్తుకు వస్తున్నాయి.

—నులకమంచంలో పడుకుని ఆకాశం వైపు చూస్తున్నాడు రాములు. పక్కనే అవ్వ—ఒకటే చిరాకు పడుతోంది; పిల్లగాని గురించి నస పెడ్తోంది.

రాములు చిరచిరలాడతావున్నాడు. వేపపుల్ల విరిచి 'థూ' అని నేలకేసి కొట్టాడు.

"నన్నేం సావమంటావే" అన్నాడు. "పిల్లోన్ని తీసుకురా పోయి" అంది. మాట్టాడకుండా మునగదీసుకున్నాడు రాములు.

ఒకపొద్దున లేచి కూచున్నాడు రాములు. 'ఏం జెయ్యాల? అత్తోరింటికిపోయి పెళ్ళాన్ని బతిమాలుకోవాలా?'' నాగన్న మాటలు గుర్తుకొచ్చినై. అవి నిజం కాలేదు. పోతూ పోతూ రాజమ్మ అన్న పలుకులూ గుర్తుకొచ్చినై.

"మరీ మిడిమేలంగా వుంది'' అనుకుని గునిసేడు రాములు.

తలెత్తి ఆకాశంకేసి చూశాడు. నక్షత్రాలు విరగబూసినై. వాటిమధ్యనుంచీ వొక తార గునగునా దోగాడుకుంటూ, తనకేసి వస్తున్నట్టు తోచింది, రాములుకి

కంబళీ బుజాన్న వేసుకుని డొంకదారికేసి వడివడిగా అడుగులువేస్తూ సాగిపోతా వున్నాడు రాములు.

అతని చూపంతా కొడుకు భవిష్యత్తుమీదే నిలిచింది.

సరిగ్గా, అదే సమయంలో—పుట్టింట్లో రాజమ్మ పిల్లోన్ని దగ్గరికి తీసుకుని మురిపెంగా నవ్వుకుంది.